# భార్య ప్రేమించకూడదా?

ఆర్. కె. కటారి

''కృష్ణా!

ఎప్పుడైనా ఏదైనా విషయాన్ని నేను భావుకతతో చెబుతున్నప్పుడు 'కథ రాయరాదూ, కరెక్ట్ చేసి పత్రికకి పంపుతాను' అనే వాడివి. నన్నుడికించటానికే నువ్వలా అన్నా, ఇన్నాళ్ళకి నిజంగానే నీ కోరిక తీరుస్తున్నాను.

ఎవరి కథో ఎందుకు? నా కథే రాస్తాను. తప్పక పత్రికకి పంపుతావు కదూ?

భాషలో తప్పులుంటే కరెక్ట్ చెయ్యి కాని భావాలను మాత్రం మార్చకు. నా భావాలు నలుగురికీ తెలియాలి.

భార్య ప్రేమించకూడదా? భర్తని ఆరాధించకూడదా?

ఈ నాటికీ ఈ ప్రశ్నలకు సమాధానాల అన్వేషణలోనే ఈ కథ రాస్తున్నాను.

'ఎందుకు కూడదు? అవశ్యం' అంటారు ఎవరైనా ప్రశ్నకి మొత్తం మార్కులు పడే సమాధానంగా. కాని నిజ జీవితంలో ఆ సమాధానాన్ని ఎందరు సమర్థిస్తున్నారు? సహిస్తున్నారు? పాటిస్తున్నారు?

నేను కేవలం తాళి కట్టించుకున్న ఆలిని కాదు, కృష్ణా.

మొదటి చూపులోనే నిన్ను ప్రేమించాను!

చూసింది ఏమిటని? నీ పాదాలని.

పిచ్చిదాన్ననుకుంటారు, వింటే ఎవరైనా.

నిజంగా నన్ను పిచ్చిదాన్నే చేశావు కృష్ణా.

ఆ రోజు. . . మా తాతయ్యతో నువ్వొక్కడివే వచ్చావు పెళ్ళి చూపులకి.

పెళ్ళి చూపుల్లో...

'పెళ్ళికొడుకు అందంగా ఉన్నాడే— ఒక్కసారి తలెత్తి చూడవే' అని స్నేహితురాలు ఎన్ని పక్కపోట్లు పొడిచినా నాకు ధైర్యం చాలలేదు. అసలు దించిన తల పైకెత్త లేదు.

కతికితే అతకదని మన సంప్రదాయం ప్రకారం పెళ్ళి చూపుల ఇంట్లో భోజనం చెయ్యరు. నీ కా పట్టింపు లున్నట్టు లేదు. భోజనం చెయ్యమంటే భోజనం చేశావు. ఎండగా ఉంది— కాస్సేపు విశ్రమించమంటే నా కోసంవచ్చావన్న సంగతి కూడా మరిచిపోయి హాయిగా నిద్రాదేవి గాఢ పరిష్వంగంలో కరిగిపోయావు.

మా తమ్ముడు జోక్ చేశాడుకూడా.

'ఏమిటే! అల్లుడైనట్టేనా?సుష్టుగా భోజనం చేసి బేషుగ్గా రెస్టు తీసుకుంటున్నాడు!''

అందరం నవ్వుకున్నాం.

అప్పుడైనా నీ ముఖం చూద్దామని మా గది వాకిట్లోంచి నువ్వు పడుకున్న గదిలోకి చూశాను.

నీ పాదాలు సాక్షాత్కరించాయి.

అయినా వాటి మీద నుంచే చూపు మరల్చుకోలేకపోయాను. ఎంత చక్కటి పాదాలు!

తెల్లగా, నడిస్తే కందిపోతాయేమో అన్నంత మృదువుగా, మలినం లేని గోళ్ళున్న పొడవైన వేళ్ళతో, బాపు తీర్చి దిద్దిన శ్రీరామచంద్రుని పాదాల్లా ఉన్నాయి.

వెనకటికి ఒక మహా చిత్రకారుడు ఒక రాకుమారి వల్లెవాటు అంచు చూసి, ఆ సుకుమారి రూపాన్ని యథాతథంగా చిత్రించాడట.

అలాగే నీ పాదాలని చూసి నీ రూపాన్ని వూహించుకున్నాను. నా వూహ తప్పు కాలేదు.

నా దొంగతనం దొరికి పోయే దాకా అలా నీ పాదాలని చూస్తూనే ఉన్నాను.

తరవాత నువ్వెళ్ళిపోతుంటే అదృశ్య పాశంతో నీకూడా నన్ను లాక్కుతున్నట్టే ఉంది.

సిగ్గు, బిడియం మరిచిపోయి ఒక్క పరుగున పెరట్లోకి వెళ్ళి, ప్రహారీగోడ మీదుగా తొంగి తొంగి చూశాను నిన్ను— కనుమరుగయ్యేంతవరకు.

నాటినుంచే నా అస్తిత్వం కోల్పోయాను, కృష్ణా!

నా ప్రాణాలన్నీ నీలోనే ఐక్యమయ్యాయి.

కనకనే నిన్ను క్షణం విడిచి ఉండలేను!

ఈ నా తాదాత్మ్యాన్ని తల్లి కానంతవరకు ఎంతో శ్లాఘించిన వాళ్ళే తరవాత తరవాత విమర్శించటం మొదలుపెట్టారు.

కృష్ణా! పిల్లలు పుట్టగానే ప్రేమకి వార్ధక్యం వస్తుందా? సంసారం పెద్దది కాగానే ఆరాధన అంతరించిపోతుందా?

అదెలా సాధ్యం నిజంగా ప్రేమిస్తే!

నువ్వే వూరైనా వెళితే ఆహారం సహించేదికాదు. నిద్ర పట్టేది కాదు. బెంగపెట్టుకునే దాన్ని.

తోడికోడళ్ళు గేలి చేసేవాళ్ళు.

'ఆ అబ్బాయి కేం— హాయిగా తిరిగొస్తాడు. శుభ్రంగా భోజనంచేసి పడుకో' మీ అమ్మ గదమాయించేది.

ఎవరేమన్నా నా ధోరణి నాదే.

గత్యంతరం లేక వూళ్ళకి పుట్టింటికెళ్ళేటప్పుడు, నా జాబు చేరిన రోజునే నీ జాబు రాయాలని, ప్రతి ఆదివారం తప్పక నా దగ్గరికి రావాలని నీ దగ్గర వాగ్దానం చేయించుకుని మరీ వెళ్ళేదాన్ని.

జాబు వస్తుందనుకున్న రోజు గడపలోనే కాపరం పెట్టేదాన్ని—నా తోడబుట్టిన వాళ్ళు నన్నాట పట్టించటానికి అవకాశం కల్పిస్తూ.

నీ జాబు చేరగానే, సకలజాగ్రత్తలూ ఏకరువు పెడుతూ ( నువ్వు మీ వూళ్ళో ఉద్యోగం చేసేటప్పుడుకూడా ) చాంతాడంత జాబు రాసి, అదే రోజు పోస్టులో పడాలని మా చిన్నతమ్ముణ్ణి పెద్ద పోస్టాఫీసుకి పరుగెత్తించేదాన్ని— లంచం సమర్పించుకుని మరీ!

కాన్పు అయిన నెలలోపే మా అమ్మని వెంటబెట్టుకుని నీ దగ్గరికి వచ్చేసేదాన్ని.

మా అమ్మ ఎంతో బతిమాలేది—

'అమ్మా! వచ్చి ఒళ్ళే! ఇంత తొందరెందుకే? అబ్బాయి ప్రతి వారం వచ్చి వెళుతున్నాడు— కదా. మూడో నెల వెళ్ళాక వెళ్ళవే!'' అని.

ససేమిరా ఒప్పుకునేదాన్ని కాదు.

మా ఇంట్లో ఏదైనా శుభకార్యాలకి వెళ్ళినా, అది పూర్తయిన వెంటనే నీతో వచ్చేసేదాన్ని— ఇంటి ఆడపడుచు విధులు, బాధ్యతలు మా చెల్లెలి మీద తోసేసి.

అప్పుడూ మా అమ్మ బతిమాలేది, 'నాలుగు రోజు లుండవే!' అని.

'కని పెంచిన తల్లి దగ్గిర కొద్ది రోజు లుండటానిక్కూడా నీకు మనస్కొప్పటం లేదటే!' అని నిష్ఠురమూ ఆడేది.

'మొగుడు బెల్లమయ్యాడంటే' అని చెల్లెలు ఎత్తి పొడిచేది.

అన్నలూ, తమ్ముళ్ళూ బలవంతం చేసేవాళ్ళు ఉండమని.

ఎవ రేమన్నా నా నిర్ణయం నాదే!

మీ ఇంట్లో మగవాళ్ళందరికీ ఒకేసారి వడ్డించే వాళ్ళు భోజనం.

నీకు నేను స్వయంగా వడ్డించాలని కోర్కె. అప్పుడే నాకు నేనూ తిన్నంత తృప్తి!

నిన్ను వాళ్ళా తినేదాకా ఆగమనేదాన్ని. నా కోరిక మన్నించేవాడివి.

'ఉమ్మడి కుటుంబంలో ఉంటూ వేరు కాపరాల పద్ధతు లేమిటి?' అని విమర్శ రాక పోలేదు.

మహానుభావుడు బావగా రొక్కరే నా మనసు అర్థం చేసుకున్నారు. అందర్నీ సమాధాన పరిచారు.

భోజనం దగ్గర నీ డ్యూటీ కలుపుకుని తినటం మాత్రమే. అన్నీ నేనే వడ్డించేదాన్ని. నీకు తిన్నట్టు ఉండదని కాని లేకుంటే నేనే తినిపించేదాన్ని.

ప్రతి రాత్రి స్నానం చేసి, ఉతికిన దుస్తులు ధరిస్తానని ఎందరికో కుళ్ళు—ఎందుకో!

వాళ్ళూ చెయ్యచ్చు కదా! ఎవ రడ్డుకుంటారు?

పగలంతా పని చేసి రాత్రికి ఒక్కసారైనా స్నానం చెయ్యకపోతే ఆ చికాకు ఎలా భరించటం?

అది నాగరిక జీవనం ఎలా అవుతుంది?

దైవ సన్నిధిలో మలిన సుమా లుంచుతారా?

మన ఏకశయ్యా పవళింపు మీదకూడా ఎంతో దుమారం!

పీఠభూమిలా ఉండే నీ విశాలమైన ఎడద నా పాలిటి సామ్రాజ్యంలా ఉండేది. అక్కడే నిత్యం గువ్వలా గూడు కట్టుకుని ఉండి పోవాలనిపించేది. నీ గుండె మీద తల అన్చి శయనిస్తేనే అద మరిచి నిద్రపోయేదాన్ని. లేకుంటే జాగరణే.

'పిల్లలు పుట్టాకకూడా మొగుడి దగ్గర పడుకోవడమేమిటి?''

'పిల్లలు ఎదిగి వస్తున్నా ఈ విడ్డూర మేమిటో?' అని వ్యాఖ్యానించే వాళ్ళు.

ఎదిగి వచ్చే పిల్లల ముందు ఎలా ప్రవర్తించాలో వాళ్ళ పాటి ఎరుగ మనుకుంటా రేమో!

భార్యా భర్తలు ఒక శయ్యమీద పడుకుంటే కాముక దృష్టి తప్ప మరో భావం కలగదా జనాలకి?

ఆ విషయంలో మనం ఎప్పుడైనా కక్కుర్తి పడ్డామా? ఎంత నిగ్రహంతో వ్యవహరించే వాళ్ళం!

ఈ విషయం మనవాళ్ళందరికీ తెలిసిపోయింది. అంత బహిరంగం చేయవలసిన విషయమా ఇది? మరి మనుషులలో సంస్కారం మాటేమిటి?

ఈ విషయం నన్నెంతో కుంగ దీసింది, కృష్ణా!

నీతో తప్ప తోటి ఆడవాళ్ళతో సినిమాకి వెళ్ళనని ఏడుపే అందరికీ.

వాళ్ళూ వెళ్ళచ్చు కదా!

నీతో ఒక సినిమాకు వెళ్ళాను. అందులో నాయకీ నాయకులు పెనుబాములని చూసి వాటి వలె నృత్యం చేసినట్టు వూహించుకుంటారు.

రసవత్తర సన్నివేశమది. ఎంత రసాత్మకంగా ఉందో!

అలాంటి రసానుభూతిని అన్యులతోకన్నా భర్తతో పంచుకోవటంలో ఉన్న ఆనందం ఆ ముఖాలకేం తెలుసు?

అప్పటి కింకా నాకు నలభై ఏళ్ళుకూడా లేవు— ఒక కోడలు పిల్ల అడిగింది—

'అదేం టత్తమ్మా, అలాంటి సినిమా కెళ్ళావు మీలాంటి వాళ్ళు భక్తి సినిమాలకి వెళ్ళాలి కాని.'?

అంటే నేను ఆ వయసుకే ముసలిదాని కింద లెక్కా?

దాని వయసుకి నన్నా మాట అడగకూడదు. చెడ్డ కోప మొచ్చింది.

కూపస్థ మండూకాలకి ఎలా తెలియ జెప్పటం? చిరునవ్వే సమాధానంగా చెప్పాను.

ఇంట్లో నువ్వుంటే ఎక్కడికీ వెళ్ళ బుద్ధి కాదు.

ఆడవాళ్ళ ముచ్చట్లకీ, మీటింగులకి అసలు వెళ్ళేదాన్ని కాదు.

'ఏమ్మా, ఎవరైనా ఎత్తుకుపోతారా మీ ఆయన్ని? విడిచి పెట్టి రానే రావు!' అనేవాళ్ళు.

పోసుకోలు కబుర్లు ముఖ్యమా? భర్త సేవలు ముఖ్యమా?

పతియే ప్రత్యక్ష దైవమని విని మురిసి పోతారే! ఆ ప్రత్యక్ష దైవాన్ని విడిచి ఎలా వెళ్ళ గలుగుతారు?

ఆత్మసాక్షి లేని అనుబంధా లెందుకు?

అనుక్షణం నిన్ను సేవించుకోవాలనే నా ధ్యాస. ఆఖరి శ్వాస నీ చేతుల్లో వదలాలనే నా ఆశ.

రోగ మొచ్చినా రొష్టు వచ్చినా, ముక్కుతూ మూలుగుతూ నైనా నీ కన్నీ అమర్చి పెట్టటం నాకు ఆత్మతృప్తి.

చూసేవాళ్ళకి హేళన.

నిన్ను విడిచి ఏ బంధువుల ఇళ్ళకు వూళ్ళకు పోనని, మొగుడు తప్ప నాకు మరో లోకం లేదని ముద్ర పడిపోయింది. మంచిదే.

ఇతరులు నన్నర్థం చేసుకోలేకపోయారు. కడుపున పుట్టిన బిడ్డలు కూడానా!

నేను వెళ్ళి వాళ్ళ పిల్లలకు సేవలు చేయనని ఒకడికి కోపం.

మనం ఉండేది ఇద్దరమే కనక వాళ్ళ పిల్లలని తెచ్చి పెంచటం లేదని మరొకడికి గుర్రు.

అంతేకాని, 'నాన్న పెద్దవాడై పోతున్నాడు. అమ్మ ఆయన్ని కనిపెట్టుకుని ఉండాలి' అని కాని, 'పెద్దవాళ్ళకి ఈ వయసులో ప్రశాంతత కావాలి'' అని కాని ఒక్కడూ ఆలోచించడు.

పిల్లల్ని కష్టపడి పెంచుకోవద్దా?

మనం వాళ్ళని అలా పెంచలేదా? మనం ఎవరి మీద పెట్టాం ఆ బాధ్యత?

'ఆయన బాగానే ఉన్నాడు కదా. ఒక్కడూ ఉంటాడులే. నువ్వు రా' అని రాస్తారు.

ఆ రాతలు చూస్తే రుద్రకాళిలా నా అంతరంగం ఉద్రేకంతో వూగి పోతుంది. మనసులో వాళ్ళమీద అసహ్యం పుట్టుకొస్తుంది.

అలా...అలా...క్రమంగా పిల్లల మీద కూడా నా భ్రాంతి తొలిగిపోయింది, కృష్ణా!

నా ఆశ నెరవేరబోతూంది.

బహు కొద్ది రోజుల్లోనే నా ఆఖరి శ్వాస నీ చేతుల్లో వదులుతాను.

కృష్ణా! భారతీయ సంప్రదాయం ప్రకారం పునిస్త్రీగా నీ చేతుల మీదుగా పోవాలనే తపన తప్ప నా ఆంతర్యం విప్పి చెప్పనా?

మనం ఒకర్ని విడిచి ఒకరు ముందుగా వెళ్ళ కూడదు. ఒకే క్షణంలో మన ఆత్మలు జంట పక్షుల్లా అనంతాకాశంలోకి ఎగిరిపోవాలి.

కాని కర్మభూమిలో పుట్టినందుకు నేను ముందుగా పోవాలని కోరుకోక తప్పదు.

కృష్ణా! నేను పోయాక నా లాగ నిన్నెవరు చూసుకుంటారు? చూడరు కృష్ణా! నా లాగ నిన్నెవర్వా చూడరు. ( సారీ, కృష్ణా! అప్రయత్నంగా బాష్ప కణాలు అక్షరాల మీద పడి చెరిపాయి ).

నేను లేకపోతే నువ్వు చిన్నబోతావు కృష్ణా!

అందుకే నన్ను ఇహలోక విముక్తురాల్ని చేశాక నా దగ్గిరికి వచ్చెయ్.

జన్మ జన్మలకీ నిన్ను కంటికి రెప్పలా కాపాడుకుంటాను.

పరలోక మార్గంలో నీ కోసం పడిగాపులు కాస్తుంటాను.

త్వరగా వచ్చెయ్! ఇద్దరం తోడుగా పయనిద్దాం.

శరీరం చాలించినా ఆత్మ నీ లోనే దాచిన,

—జయకృష్ణ.''

ఆ ఉత్తరం కృష్ణమూర్తి చేతుల్లో ఉంది.

అతని ముందు తను పెళ్ళయిన కొత్తల్లో భార్యకి రాసిన ఉత్తరాల దొంతరలు చిందర వందరగా పడి ఉన్నాయి. అతని ఎదుట ఎన్‌లార్జ్ చేయించి పటం కట్టించి పూలదండ వేసిన జయమ్మ ఫోటో గోడకి ఆనించి ఉంది.

అతను చిన్నపిల్లవాడిలా కదిలి కదిలి వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు. ఏడుస్తూ ఏడుస్తూ అకస్మాత్తుగా జయమ్మ పటం ముందు మోకరిల్లి నట్టుగా వాలిపోయాడు. ★

